ఈనాడు
సిద్దిపేట
బుధవారం అక్టోబరు 2, 2024

ఆకతాయిల భరతం పడతాం: సీపీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మహిళలు, బాలికలు, పిల్లల రక్షణ కోసం పోలీసు శాఖ అహర్నిశలూ కృషి చేస్తుందని సీపీ అనురాధ తెలిపారు. ముఖ్యంగా ఆకతాయిల భరతం పట్టడానికి షీటీమ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు సెప్టెంబరు నెలలో వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల వివరాలు మంగళవారం ఆమె వెల్లడించారు. ఆ నెలలో 28 మంది ఆకతాయిలపై పెట్టీ కేసులు నమోదు చేశామన్నారు. 32 హాట్‌స్పాట్లను గుర్తించి అక్కడి 225 సార్లు సందర్శించామన్నారు. మహిళలకు అత్యవసరమైతే డయల్ 100, షీటీమ్ వాట్సాప్ నెంబరు 87126 67434, కంట్రోల్ రూమ్ నెంబరు 87126 67100 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. గృహహింసకు గురైతే స్నేహిత కేంద్రం 94946 39498 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

● సిద్దిపేటలోని సార్వత్రిక పది, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు రెండింటి వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. 3వ తేదీ నుంచి ఈనెల 9 వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు.

సిబ్బంది కొరతతో ఎల్ఆర్ఎస్ ఆలస్యం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట పురపాలిక పరిధిలో పది వెంచర్లలో సుమారు 32 వేల ప్లాట్లు ఉన్నాయని, సిబ్బంది కొరతతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఆలస్యమవుతుందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ప్రక్రియను వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని రంగధాంపల్లిలోని మారుతీనగర్‌లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుడా డీటీసీపీవో వందనం, బల్దియా టీపీవోలు పాల్గొన్నారు.

● ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నుంచి మంగళవారం కలెక్టర్లు, అధికారులతో దృశ్య సమీక్ష నిర్వహించగా సిద్దిపేటలో మనుచౌదరి, శ్రీనివాస్‌రెడ్డి, దేవకీదేవి, అధికారులు పాల్గొన్నారు.

● ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన అక్కన్నపేట మండల పంచాయతీ అధికారి దివిటి కవికుమార్ సంతాప సభను కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు.



సెలవులొచ్చే.. రద్దీ తెచ్చే..

బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో విద్యాసంస్థలకు వరుస సెలవులు రావటంతో పట్టణమంతా సందడిగా మారింది. సిద్దిపేటలోని మోడ్రన్‌బస్టాండ్, ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ పూర్తిగా ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఆడపడుచులు, విద్యార్థులు తమ సొంత ప్రాంతాలకు తరలివెళ్లారు. వసతిగృహాల్లోని విద్యార్థులను వారి తల్లిదండ్రులు, పోషకులు పెట్టే, బేడా సర్దుకుని తీసుకువెళ్లటం కనిపించింది. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

హేరామ్!



గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ పాత కార్యాలయం ముందు గతంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. బాగు చేయించేవారు ఎవరూ లేరు. నేడు గాంధీ జయంతి సందర్భంగా ఎవరైనా బాపు అభిమానులు వచ్చి విగ్రహానికి పూలదండలు వేయాలన్నా ఇబ్బందిగా ఉంది. జాతిపితపై గౌరవంతో విగ్రహాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గజ్వేల్

విరుల సిరులు.. ఆత్మీయతల సెలయేరు



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకొనే ఈ వేడుకలు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ పండగ వచ్చిందంటే ఆడపిల్లలకు ఎక్కడ లేని సంబరం. ఆడపడుచుల ఆత్మీయతకు వేదికగా నిలుస్తుంది బతుకమ్మ సంబరం. **నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం** కానున్న నేపథ్యంలో నాలుగు జిల్లాల్లోని ప్రత్యేకతలపై కథనం.

వీడని బంధం

హుస్నాబాద్ గ్రామీణం: బతుకమ్మ వేడుకలు ఎక్కడికక్కడ చేసుకోవడం కనిపిస్తుంది. అలాంటిది ఇక్కడ మాత్రం రెండు ఊర్లు కలిసి జరుపుకోవడం విశేషం. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ తోటపల్లిలో కలిసి ఉండేది. 1995లో గాంధీనగర్ ప్రత్యేక గ్రామ పంచాయతీగా వేరుపడింది. అయినా పాత సంప్రదాయాన్ని వీడలేదు. ఇప్పటికీ కలిసే పండగ నిర్వహించుకుంటున్నారు. 29 ఏళ్లుగా కలిసే బతుకమ్మ ఆడుతుండటం విశేషం. మిత్రులు, బంధువులు కలుసుకుంటారు.



అక్కడి వారైనా..

జిన్నారం: బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేక పండగ. అలాంటి వేడుకలను జిన్నారం పారిశ్రామిక ప్రాంతంలో దేశంలోని అన్ని ప్రాంతాల వారు కలిసి చేసుకోవడం కనిపిస్తుంది. ఇక్కడ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు నివాసం ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మిక కుటుంబాలు వేడుకల్లో భాగస్వాములు అవుతున్నారు. ఐడీఏ బొల్లారంలోని కేబీఆర్, వైఎస్ఆర్, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లో ఈ వేడుక సంబరంగా కనిపిస్తుంది. నవరాత్రుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయి. ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేస్తుంటాయి.



సమకాలీన అంశాలపై..: ఎర్రం అవంతి, రామాయంపేట



బతుకమ్మ అంటేనే తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం. దీని ద్వారా సందేశం ఇచ్చేందుకు యత్నిస్తున్నా. పదేళ్లుగా సమకాలీన అంశాల ఆధారంగా బతుకమ్మను తీర్చిదిద్దుతున్నా. పూలనే దేవతగా పూజించడం మనకే చెల్లింది. మహిళలపై అత్యాచారాలు నేపథ్యంలో పలు చట్టాలను తెలియజేస్తూ, కరోనా సమయంలో మాస్కు తప్పనిసరని, ట్రాఫిక్ నిబంధనలు, చంద్రయాన్ 3 వంటి బతుకమ్మలను ప్రత్యేకంగా తయారుచేశాను.

- న్యూస్‌టుడే, రామాయంపేట

ఆనవాయితీగా ఇక్కడే..



మెదక్ అర్బన్: మెదక్‌లో బతుకమ్మ సంబరాలనగానే ముందుగా గుర్తుకొచ్చేది కోదండ రామాలయమే. పట్టణంలోని కాలనీలు, కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడుతారు. అనంతరం కోదండ రామాలయానికి తీసుకురావడం ఆనవాయితీ. ఇక్కడికొచ్చాకే నిమజ్జనం చేస్తారు. ఏ వీధిలో చూసినా బతుకమ్మలన్నీ చేరే వేదిక మెదక్ కోదండ రామాలయం.

సిద్దిపేటలో కోలాహలంగా..



సిద్దిపేట: సిద్దిపేటలో బతుకమ్మ వేడుకలు ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. తొమ్మిది రోజులు కూడళ్లు.. నయనానందాన్ని పంచుతాయి. రాష్ట్రంలో వరంగల్ తర్వాత అత్యంత కనులపండువగా జరిగేది ఇక్కడే. వివిధ పూలతో బతుకమ్మలు పేర్చడం మొదలు.. మహిళలు ప్రత్యేక అలంకరణతో వైవిధ్యాన్ని చాటుతారు. దారులన్నీ స్థానిక కోమటిచెరువు వైపే. సాంస్కృతిక కార్యక్రమాలు వైభవాన్ని చాటుతాయి.

విశిష్టత తెలిసేలా..

పాపన్నపేట: బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో రెండో తరగతి తెలుగులో పాఠం రూపంలో పొందుపర్చారు. పూలు సేకరించినప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకు వివరించారు. రంగురంగుల పూలు, బతుకమ్మ పేరుద్దాం, బతుకమ్మ ఆడుదాం, బతుకమ్మలెత్తుదాం, పోయిరా గౌరమ్మ అంటూ ఐదు గేయాలను పొందుపరిచారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

చేర్యాల, న్యూస్‌టుడే: అత్యాచార ఘటన బాధిత కుటుంబాన్ని మంగళవారం పలువురు పరామర్శించారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, భాజపా ధార్మిక పరిషత్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్, సినీ నటి కరాటే కల్యాణి స్థానిక భాజపా నాయకులతో కలిసి గురువన్నపేటకు వచ్చారు. బాధిత కుటుంబాన్ని కలిసి ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నిందితుడికి తక్షణమే కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి భాజపా అండగా ఉంటుందన్నారు. వారి వెంట భాజపా కొమురవెల్లి మండలాధ్యక్షుడు నాగరాజు తదితరులు ఉన్నారు. ● నిందితుడిని శిక్షించాలని కురుమ యువ చైతన్య సమితి(కేవైసీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నరసింహ డిమాండ్ చేశారు. గురువన్నపేట ఘటనకు నిరసనగా కేవైసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాలలో ఆందోళన చేశారు. స్థానిక గాంధీ కూడలిలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కురుమ, కేవైసీఎస్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దసరా డ్రాలో పొట్టేలు ఆఫర్?

న్యూస్‌టుడే, నంగునూరు: బతుకమ్మ, దసరా పండుగలు సమీపించిన వేళ నంగునూరులో బంపర్ ఆఫర్లు, లక్కీ డ్రాలు అంటూ కూపన్ల హంగామా జరుగుతోంది. రూ.100 కూపన్ కొంటే డ్రా తీసి బహుమతులు ఇస్తామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. పొట్టేలు, మేక, మద్యం సీసా, కాటన్ బీర్లు, కోడి పుంజులు, నాటు కోడి అంటూ వివిధ మద్యం బ్రాండ్లను ప్రస్తావిస్తూ కూపన్లు కొనుగోలు చేయాలని చెబుతున్నారు. ఫోన్‌పే, జీపే నంబర్లు కూడా ఇస్తున్నారు. వీటిని చూసిన ప్రజలు ఔరా.. దసరా ధమాకా అనుకుంటూ ఆశ్చర్యపోతున్నారు.



మాట్లాడుతున్న జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జయదేవ్ ఆర్య, వేదికపై అధికారులు, నిర్వాహకులు

యువ.. నవ.. ఉత్సాహం

‘మాంకాళమ్మనురా.. దుష్టుల దునుముదురా..’, ‘జుంబారే.. జుంబారే..’ ఇలా పాటలతో కూడిన నృత్యాలతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సంప్రదాయ, జానపద కళలను విద్యార్థులు సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో మంగళవారం ప్రదర్శించారు. ప్రేక్షకులను సంతోషపరిచారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల విభాగం ఆధ్వర్యంలో జరిగిన యువజనోత్సవాలను అధికారి జయదేవ్ ఆర్య ప్రారంభించి మాట్లాడారు. అకాడమిక్ విద్యాభ్యాసంతో పాటు కళల్లోనూ విద్యార్థులు, యువత ఆరితేరాలని ఆయన సూచించారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట











జిల్లాకేంద్రం ప్రభుత్వ నూతనోన్నత పాఠశాలలో బతుకమ్మ అక్షరాల్లో ప్రదర్శన

ఆటపాటలతో ఉయ్యాలో.. సందడి నెలకొంది ఉయ్యాలో..

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: నేటి నుంచి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అని వాడవాడలా, పల్లెపల్లెనా, పురవీధుల్లో ఆటాపాట మార్మోగనుంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు సిద్దిపేటలో ముందస్తుగా ప్రారంభమయ్యాయి. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రంగురంగుల బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. ఇక్కడ పిండివంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రిన్సిపల్ డా.సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో జడ్పీ మాజీ అధ్యక్షురాలు రోజాశర్మ, బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజుల పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో సంబరాలు అట్టహాసంగా జరిగాయి.



సిద్దిపేటలోని ప్రైవేటు బడిలో..



బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాగు తగ్గుదల.. ధర పెరుగుదల

వర్షాకాలంలో మొక్కజొన్న పంట తీరు

న్యూస్‌టుడే, గజ్వేల్: ప్రస్తుతం మొక్కజొన్నలు క్వింటాలుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను దాటి రూ.3 వేల వరకు అమ్ముడుపోతున్నాయి. రైతులకు లాభాలు అందివస్తాయనుకుంటే పంట విస్తీర్ణం మాత్రం తక్కువగా ఉంది. గత కొన్నేళ్లుగా మొక్కజొన్న పంట సాగు తగ్గుతూ వస్తోంది. గతంలో జిల్లాలో 1.50 లక్షల ఎకరాల నుంచి 2 లక్షల ఎకరాల్లో సాగైన మొక్కజొన్న రాన్రాను వేల ఎకరాల్లోకి తగ్గిపోయింది. గతంలో ధర లేకున్నా ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసిన రైతులు ఇప్పుడు ధరలు పెరుగుతున్నా ఈ పంట సాగుపై ఆసక్తి చూపటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద ఓ కారణం. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎక్కువగా వరి సాగుపైనే మక్కువ చూపుతున్నారు. గతంలో వేల ఎకరాల్లో సాగైన వరి పంట ఇప్పుడు లక్షల ఎకరాల్లోకి పెరిగింది. కోళ్లఫారాల్లో వినియోగించే దాణాకు సబంధించిన మొక్కజొన్నలు ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు దిగుమతి చేస్తుండటం సాగు తగ్గిపోవటానికి కారణమని అన్నదాతలు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో మొక్కజొన్న మరింత తక్కువగా సాగు అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



గజ్వేల్‌లో పంట నూర్పిళ్లు

మొక్కజొన్న సాగు తీరు (ఎకరాల్లో)

సంవత్సరం	యాసంగి	వానకాలం
2021	14,518	46,950
2022	16,570	32,206
2023	22,844	26028

సంవత్సరం / మద్దతు ధర (క్వింటాలుకు రూ.లో)

సంవత్సరం	మద్దతు ధర
2021	1870
2022	1962
2023	2090
2024	2225

బదనాం చేసేందుకు భారాస కుట్ర: మైనంపల్లి

గజ్వేల్, తొగుట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళనపై భారాస చేస్తున్న రాద్ధాంతం ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్రలో భాగమేనని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆరోపించారు. ఆయన మంగళవారం గజ్వేల్లో మల్లన్నసాగర్ నిర్వాసితులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. కొల్గూరు, తుక్కాపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారాస నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్ని రెచ్చగొడుతున్నారన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని కొన్ని కాలేజీలు, పెట్రోలు బంకులను పేదల పేర్లతో నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టి పెట్టాలని కోరామన్నారు. రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారన్నారు. కొల్గూరులో కొన్ని ఇళ్లను హరీశ్‌రావు నాడు కూల్చివేయించి నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల గోడు పట్టదా.. అని ప్రశ్నించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, దుబ్బాక ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. తుక్కాపూర్ ఇళ్లలోకి వస్తున్న నీటిని హనుమంతరావు పరిశీలించారు. మాజీ సీఎం కేసీఆర్ మల్లన్న సాగర్ ప్రారంభోత్సవంలో రూ.వంద కోట్లతో గ్రామాన్ని మరో చోట నిర్మిస్తామని చెప్పి విస్మరించారన్నారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నాయకులు

నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

న్యూస్‌టుడే, సిద్దిపేట: డీఎస్సీ-2024 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు బుధవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (కోర్టు వెనుక వైపు) ప్రారంభం కానుంది. ఈ మేరకు విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా.. రాష్ట్ర విద్యా శాఖ నుంచి 1:3 అభ్యర్థుల జాబితా ఆలస్యంగా రావడంతో తేదీలో మార్పు చేశారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు కొనసాగించనున్నారు. 154 ఎస్ఏలు, 157 ఎస్‌జీటీల పోస్టులు భర్తీ చేయనున్నారు.

బతుకమ్మ వేడుకల శుభాకాంక్షలు

హుస్నాబాద్, సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ చేసుకునే బతుకమ్మ వేడుకల ప్రారంభం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నేటి నుంచి సద్దుల బతుకమ్మతో ముగిసే పూల పండగ, బతుకునిచ్చే బతుకమ్మ పండుగను ఆడబిడ్డలు బాగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. హుస్నాబాద్ పట్టణంలో నేడు వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి పాల్గొంటారు. ● సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందంగా చేసుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

జగదేవపూర్, న్యూస్‌టుడే: వేరుశనగ సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను హైదరాబాదు నుంచి ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్త డా.రామిరెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (పాలెం) నుంచి దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా తీగుల్‌లో రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి రాధిక పాల్గొన్నారు.

‘పరిహారంపై కలెక్టర్‌కు నివేదిస్తాం’

వర్గల్: భూనిర్వాసితుల డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని ఆర్డీఓ బన్సీలాల్ అన్నారు. మంగళవారం ఏసీపీ పురుషోత్తంరెడ్డితో కలిసి ఆయన వర్గల్ పరిశ్రమల ప్రాంతంలో సందర్శించారు. డిమాండ్లకు సంబంధించిన వినతిపత్రం స్వీకరించారు. పరిహారం అంశాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. టీజీఐఐసీ జోనల్ మేనేజర్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

ఇలా ఆటంకం.. అలా మరమ్మతులు

● నిరంతర నీటి సరఫరా లక్ష్యంగా సిబ్బందికి శిక్షణ

సరఫరా ఏరియాలు	774
కుళాయిలు	2.75 లక్షలు
సహాయకులు	542
ట్యాంకులు	1515

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: నీటి సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే ఎక్కడ లోపం ఉందో గ్రహించి మరమ్మతులు చేసి ఆటంకం లేకుండా చేయడానికి నిపుణులైన సహాయకులు సిద్ధమవుతున్నారు. పల్లెల్లో మిషన్ భగీరథ పనుల నిర్వహణ కోసం గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు (సహాయకులకు) నైపుణ్య శిక్షణను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మిషన్ భగీరథ అధికారులు శిక్షణ అందిస్తున్నారు. జిల్లాలో 543 మందికి శిక్షణ ఈ నెల 19 వరకు కొనసాగనుంది.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

పల్లెల్లో తాగునీటి సరఫరాలో ఏవైనా ఇబ్బందులు తలెత్తినప్పుడు సహాయకులకు సరైన అవగాహన ఉండటం లేదు. చిన్నపాటి మరమ్మతుకు సైతం ఎక్కువ నిధులు ఖర్చు చేయాల్సి వస్తోంది. సహాయకులకు శిక్షణ ఇస్తే వారే పరిష్కరిస్తారని భావించి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షకులు అవగాహన కల్పిస్తున్నారు. సరఫరాలో తరచూ లీకేజీలు, పైపులైన్లలో సమస్యలు తలెత్తుతాయి. రోజు వారిగా చేతి పంపు మరమ్మతులు, సింగిల్, త్రీఫేజ్ బోరు మోటారు నిర్వహణ, మరమ్మతులు, లీకేజీలు, నీటి నాణ్యత, ట్యాంకుల శుభ్రత నిర్వహణపై నాలుగు రోజుల పాటు నేర్పిస్తున్నారు.



పైపు లైను పనులు నేర్పుతున్న శిక్షకులు

ఇబ్బందులు ఉండవు: సుమలత, మిషన్ భగీరథ డీఈ, సిద్దిపేట

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే తాగునీటి సరఫరా సహాయకులు సమస్య పరిష్కరించే దిశగా ప్రభుత్వం కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇస్తోంది. స్థానికంగా పని చేసే సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తారు.

చేతిపంపు: గతంలో చేతి పంపులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. చేతి పంపులు వినియోగంలో లేకపోతే మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తారు.

నీటి నాణ్యత: నీటి నాణ్యత పరీక్షలను మల్టీపర్పస్ కార్మికులే నిర్వహిస్తారు. క్లోరినేషన్, శుభ్రం చేయడంపై శిక్షణ ఇస్తున్నారు. ట్యాంకు వద్ద సమస్యలు తలెత్తినప్పుడు సరిచేస్తారు.

ఎలక్ట్రీషియన్: సింగిల్, త్రీఫేజ్ బోరుబావులకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు, స్టార్టర్లలో సాంకేతిక సమస్య వచ్చి పనిచేయవు. గుర్తించి, మరమ్మతులు చేస్తారు.

లీకేజీలు: గ్రామాల్లో ప్రధానమైనది పైప్‌లైన్ లీకేజీ సమస్య. రహదారులపై, మురుగు కాల్వల్లో పైపులు పగిలి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. పైపులైన్ల ప్లంబింగ్ శిక్షణతో మరమ్మతు చేస్తారు.

రైతుల్లో చైతన్యంతోనే అధిక దిగుబడులు


ములుగు, న్యూస్‌టుడే: స్వల్ప వ్యవధిలో అధిక దిగుబడులతోపాటు ఆదాయాన్ని ఇచ్చే కూరగాయ పంటలను సాగు చేయాలని రైతుల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని ములుగులోని కొండా లక్ష్మణ్, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ నీరజ ప్రభాకర్ అన్నారు. మంగళవారం వర్సిటీలో విత్తనాలు, ఎరువులు, మల్చింగ్ పేపర్లను నర్సంపల్లి రైతులకు అందజేశారు. డీన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

జాతిపిత.. స్ఫూర్తిప్రదాత

బాపు మాట: మహిళ అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే అసలైన స్వాతంత్య్రం.

మహిళలకు సమాన అవకాశాలు ఉండాలి. అన్నింటా రాణించాలి. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నది జాతిపిత అభిమతం.

సాధికారత దిశగా..




అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు సాధికారత దిశగా పయనిస్తున్నారు. ఉన్నత చదువుల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సమాజం వారికి అండగా నిలవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. నాలుగు జిల్లాల్లో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. మెదక్‌లో 11,833, సంగారెడ్డిలో 16,477, సిద్దిపేటలో 16,773, వికారాబాద్‌లో 12,597 సంఘాలున్నాయి.

నేడు గాంధీ జయంతి

సత్యం, అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా యావత్ భారతావనిని ఒక్కటి చేసి స్వాతంత్య్రాన్ని తెచ్చి పెట్టారు. ఈ మాట వినగానే మన కళ్ల ముందు ఓ బక్కపల్చని శరీరం, తెల్ల ధోవతి, భుజాన కండువా గుర్తుకొస్తాయి. ఆయనే మనమంతా మహాత్మా అని పిలుచుకునే గాంధీజీ. సమష్టితత్వంతో తెల్లదొరలను తరిమికొట్టడమే కాక సమాజం మెరుగైన బాటలో నడవాలన్న సంకల్పం, పోరాట పటిమ జాతిపితకు మార్గాలు.. గాంధీయిజం అందరికీ ఓ చుక్కాని పాఠం. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్ఫూర్తితో మార్పును కాంక్షిస్తూ ప్రత్యేకత చాటుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, సిద్దిపేట, జహీరాబాద్ అర్బన్, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్




గాంధీజీ వాక్కులు

- సత్యం భగవంతుడికన్నా గొప్పది.
- అహింస ఎదుట హింస పటాపంచలు.. సత్యం ఎదుట అసత్యం శాంతించాలి.
- వ్యక్తిత్వం కోల్పోతే వ్యక్తి సర్వస్వం కోల్పోయినట్లే.
- పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

బాపు మాట: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

గ్రామస్వరాజ్యం బాపూజీ కన్న కల. పల్లెలు అన్నింటా రాణిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. స్వరాజ్యం సాధనకు గ్రామస్థులు సంఘటితంగా ముందుకు సాగాలి.

ప్రణాళికాబద్ధంగా..



గాంధీజీ స్ఫూర్తిగా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామస్థులు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. దారులకు ఇరువైపులా పూల మొక్కలు నాటి సంరక్షించగా పచ్చదనం అలరిస్తోంది. ఈ-పంచాయతీ నిర్వహణ, ఇంటింటికీ తాగునీరు, తడి, పొడి చెత్త సేకరణ, జనన, మరణ, వివాహ నమోదు సహా ధ్రువపత్రాల జారీ, వీధి దీపాలు, మురుగు కాల్వలు, పచ్చదనం, పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ నిర్వహణలో ముందంజలో నిలిచింది. తద్వారా ఈఏడాది జనవరిలో ఐఎస్‌వో ధ్రువపత్రం దక్కింది.

బాపు మాట: నిన్ను నీవు కనుగొనడానికి మార్గం.. ఇతరుల సేవలో నిన్ను నీవు మరచిపోవడమే.

ఆపన్నులకు సాయం చేయడంలోనే నిన్ను నీవు తెలుసుకుంటావంటారు మహాత్ముడు. దీని స్ఫూర్తిగా ఎంతోమంది పేదలకు, ఆపన్నులకు అండగా నిలిచారు.

ఆత్మహత్యలకు చలించి..

మల్లన్నసాగర్ నిర్మాణంలో ముంపునకు గురైన ఏటిగడ్డకిష్టాపూర్‌కు చెందిన పులి రాజు ప్రస్తుతం వర్గల్ మండలం తునికి ఖల్సా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2000లో రాష్ట్రవ్యాప్తంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను చూసి చలించారు. ఇప్పటివరకు 3 వేల బాధిత కుటుంబాలకు సాయం అందించారు. దాతల సహకారంతో పిల్లల్ని చదివిస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న రాజు

బాపు మాట: కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలం.

సాధన లేకుండా విజయాన్ని సొంతం చేసుకోలేం. లక్ష్య సాధనకు కఠోర శ్రమ తప్పనిసరి. ఉన్నతమైన ఆలోచనలను నిర్దేశించుకోవాలన్నది గాంధీ సూచన.

ప్రతిభ చాటేలా..



జనాభాలో గరిష్ఠ భాగం యువతదే. వారంతా చదువే లక్ష్యంగా కాకుండా క్రీడలు, వ్యాయామం, శిక్షణలపై దృష్టి సారించాలి. ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభ చాటుకోవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో యువత సంఖ్య 15 లక్షలకు పైనే. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో నాలుగు జిల్లాలకు చెందిన 302 మంది ప్రతిభ చాటడం విశేషం. మెదక్‌కు చెందిన యూత్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు విపత్కర పరిస్థితుల్లో ఇతరులకు సేవ అందిస్తున్నారు.


ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.

ఎలాంటి చర్యలతో గ్రామాల ప్రగతి సాధ్యం?




- ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి
- ప్రజలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేయాలి

మహిళలకు ఎలాంటి ప్రోత్సాహం అవసరం?



- వివక్షకు వ్యతిరేకంగా స్వేచ్ఛను కల్పించాలి
- నచ్చిన రంగంలో ప్రగతి సాధించేలా వెన్నుతట్టాలి

మహాత్ముడి బోధనలు అనుసరిస్తున్నారా?



అవును ■ కాదు ■



గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా హరిత పత్రంపై కిన్నెర అంజయ్య గీసిన చిత్రాలు – న్యూస్‌టుడే, సిద్దిపేట

నాట్యం.. జనరంజకం



కోయ నృత్యం



ఎల్లమ్మ నాటక ప్రదర్శన



సిద్దిపేట విపంచి కళానిలయం వేదికపై విద్యార్థుల ప్రజ్ఞ.. ఆహూతులను అలరించింది. జానపద, శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో యువజనోత్సవాలను విద్యార్థులు ఉర్రూతలూగించారు. ఈ సందడి మంగళవారం యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది.

– న్యూస్‌టుడే, సిద్దిపేట

ఉత్తమ సేవలకు గుర్తింపు

హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు బోనగిరి లక్ష్మణ్ అందించిన ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఈ నెల 2న దిల్లీలో జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపు సభలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సత్కరించనుండటం విశేషం. లక్ష్మణ్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆర్ఎంపీగా పని చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పలు కారణాలతో పంచాయతీ కార్మికుడిగా చేరారు. ఏ పనైనా నిబద్ధతతో చేయడమే ఇతడికున్న అలవాటు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు తోటి కార్మికులతో కలిసి శ్రమిస్తుంటారు. ఈయన సేవలకు పలు సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవార్డులు అందించడంతో ప్రత్యేకంగా సత్కరించారు. ఈ క్రమంలో గత నెల 17 నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా ముగింపు సమావేశం బుధవారం (2న) దిల్లీలో జరుగనుంది. గ్రామీణాభివృద్ధికి సంబంధించి వివిధ విభాగాల్లో ఉత్తమ సేవ అందించిన వారిని ఎంపిక చేసి దీనికి ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి మొత్తం 10 మంది ఎంపికయ్యారు. గ్రామ పంచాయతీ కార్మిక విభాగంలో లక్ష్మణ్ చోటు దక్కించుకోవడం విశేషం. కేంద్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం మేరకు మంగళవారం దిల్లీకి బయల్దేరారు.

– న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం




దిల్లీ వెళ్లిన వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, కార్మికులు, స్వయం సహాయక సంఘం సభ్యులు



లక్ష్మణ్

గుడి కట్టి.. అభిమానం చాటి..

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామస్థులు మహాత్ముడికి ఆలయం నిర్మించి పూజిస్తుండటం విశేషం. ఐదు దశాబ్దాల క్రితం జాతిపిత ప్రతిమ ఏర్పాటు చేశారు. ఆలయాల్లో మాదిరిగా మహాత్ముడి విగ్రహం ఎదుట నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి, మొహర్రం వంటి పండగల వేళ గాంధీజీకి పూజలు చేసి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. 1995లో దివంగత ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, అప్పటి సర్పంచి పీకే పాటిల్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేశారు. మహాత్ముడికి జయంతి, స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలను ఇక్కడే చేపడతారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్



1973లో నెలకొల్పి..



మహాత్ముడు చూపిన బాటలో సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో గాంధీ విగ్రహం నెలకొల్పి పూజిస్తుండటం విశేషం. 1973లో అప్పటి సర్పంచి వెంకట్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పి.రామచంద్రారెడ్డిలు కలిసి ప్రతిమ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్థానికుడు మహాలింగం ప్రతి శుక్రవారం పూజలు చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన చిన్న కుమారుడు అడివయ్య స్వామి కొనసాగిస్తున్నారు. గాంధీ జయంతి రోజున ప్రత్యేక పూజలతో పాటు క్షీరాభిషేకం చేసి జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం గ్రామ సభ నిర్వహిస్తారు. – న్యూస్‌టుడే, కొండాపూర్

అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ ఆరా

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో జరిగిన అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆరా తీశారు. ఈ మేరకు గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి కైలాస్ నాగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట సీపీ అనూరాధతో గవర్నర్ మాట్లాడి.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత బాలికకు పునరావాసం కల్పించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



అంజిలయ్య

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: బొంరాస్‌పేట మండలంలోని ఎన్నేపల్లి గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్థులు, ఎస్సై రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం అంజిలయ్య (34) రోజు మాదిరిగానే ఉదయం వరిపొలం చూసేందుకు వెళ్లాడు. పొలానికి చుట్టిన తీగపై విద్యుత్తు తీగ పడి ఉండటం గమనించకుండా వెళ్లడంతో విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య సంగెం లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో యువకుడు..



నర్సింలు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పాండు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు(28) శివారులోని సామిల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన చరవాణిలో మాట్లాడుకుంటూ సామిల్ సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆ నియంత్రిక ఎర్తింగ్ తీగకు కాలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి దుర్మరణం

వర్గల్, న్యూస్‌టుడే: వెనుకనుంచి వచ్చిన వాహనం ఢీకొని చిరువ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ములుగు మండలం తునికిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పూసల కృష్ణ (50) ద్విచక్ర వాహనంపై అప్పడాలు, మసాలాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గిర్మాపూర్ గ్రామం నుంచి వెళుతుండగా వెనుకనించి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఎగిరి రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. అతడి భార్య పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యాచరణ.. విజ్ఞాన బాట

ప్రణాళికతో సెలవుల్లో వెలుగులు

సమయం వెలకట్టలేనిది. ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. విద్యాసంస్థలకు నేటి నుంచి ఈ నెల 14 వరకు ప్రభుత్వం బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటించిన విషయం విదితమే. 13 రోజుల పాటు ఇచ్చిన పండగ సెలవులను వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్ కలెక్టరేట్

ఫోన్లకు దూరం సుమా..




విద్యాసంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్, సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికితే స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కొందరు గంటల కొద్ది చూస్తుంటారు. వారిని కాస్త కట్టడి చేయాలి. ఇతర అంశాలపై దృష్టి మరల్చాలి.

జిల్లాల వారీగా విద్యార్థులు (లక్షల్లో)

1.74	1.09
2.79	1.20

సిద్దిపేట ● | మెదక్ ● | సంగారెడ్డి ● | వికారాబాద్ ●

గౌరవం పెంచుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానం అలవర్చాలి. ఊర్లకు పంపిస్తారు కనుక పెద్దలను గౌరవించడం నేర్పించాలి. రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. కలిసి భోజనం చేయడం, సరదాగా, స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ.. హిత వచనాలు వల్లెవేయాలి.

ప్రోత్సాహంతో ఉత్సాహం..



పిల్లలకు ఆసక్తి ఉన్న ఆటపాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం, ఇతర అంశాలనే నేర్చుకునే అవకాశం కల్పించవచ్చు. ఫలితంగా పట్టు సాధించవచ్చు.

పుస్తకం వైపు మరలేలా..



మారుతున్న పరిస్థితుల్లో పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. ఈ క్రమంలో ప్రతి జిల్లాలో చెంతనే ఉండే విజ్ఞాన భాండాగారాలను వినియోగించుకోవచ్చు. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి.

గ్రంథాలయాలు

21	16
33	20

చెంతనే పర్యాటకం..



కొందరు దర్శనీయ ప్రాంతాలకు సుదూరం వెళ్తుంటారు. కాస్త ఉపాయంగా ఆలోచిస్తే చెంతనే పర్యాటక ప్రదేశాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో కోమటిచెరువు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, నాగుల బండ వద్ద అర్బన్ ఫారెస్టు, మెదక్‌లో ప్రఖ్యాత చర్చి, గోల్‌బంగ్లా, సంగారెడ్డి జిల్లాలో మంజీర నది, మ్యూజియం, వికారాబాద్‌లో అనంతగిరి అడవులు ప్రత్యేకం. ఆయాచోట్లకు వెళ్తే వినోదం, విజ్ఞానం పంచేందుకు దోహదం చేసినట్లే.

పర్యాటకులు ఇలా..

10,000	4,500
3,100	2000

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా పెద్ద అంతా కలిసి ఉండే వారు. సెలవుల్లో అమ్మమ్మ, నాయనమ్మ ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదునుగా సెలవులను సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండగ విశిష్టతను తెలియజేయాలి.

జిల్లాల వారీగా కుటుంబాలు (లక్షల్లో)

2.38	2.14
3.29	1.98

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ రాములు, పీఈటీ అనిల్‌కుమార్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాములు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14, 17 సహా ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్ అండర్-17 విభాగాల్లో విద్యార్థులు రాహుల్, మల్లేశం, అర్మాన్, అఖిల్, మునీర్, షాహిద్ ఎంపిక కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల్లో సత్తా చాటేలా శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ గౌడ్, పీఈటీ అనిల్‌కుమార్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

సదాశివపేట, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్ న్యాయమూర్తి భవానీ చంద్ర మంగళవారం తీర్పు వెలువరించారని సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. 'వికారాబాద్ జిల్లా జాంబపూర్ తండాకు చెందిన కాట్రోత్ రవినాయక్ తన మొదటి భార్య చనిపోవడంతో రెండవ భార్యతో కలిసి సదాశివపేట మండలం ఆత్మకూర్‌లో నివాసం ఉంటున్నారు. మొదటి భార్య కూతురు రేణుక వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కస్తూర్బాలో 8వ తరగతి చదువుతోంది. 2020 సంవత్సరంలో కూతురు ఆరోగ్యం బాగా లేదని చికిత్స నిమిత్తం పాఠశాల నుంచి సదాశివపేటకు తీసుకొచ్చాడు. తిరిగి పాఠశాలకు తీసుకెళ్లేటప్పుడు మార్గమధ్యలో గొంతు నులిపి చంపేసి జ్వరంతో చనిపోయిందని అందరిని నమ్మించాడు. అనుమానం వచ్చి అప్పటి వీఆర్వో పోలీసులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని' సీఐ వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



నర్సింలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మద్యం మత్తులో భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం కౌడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామ పంచాయతీ పాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గాదె నర్సింలు(35), మౌనిక దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. భార్య ఎనిమిది నెలల క్రితం కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన నర్సింలు మద్యం మత్తులో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకులు వచ్చి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. నర్సింలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మోసం చేసిన స్థిరాస్తి సంస్థ

సాయిసూర్య డెవలపర్స్ ఎండీపై కేసు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడితో ప్రచారం చేయించి, భారీ వెంచర్లు ప్రారంభిస్తున్నామని ఆర్భాటం చేసిన హైదరాబాద్‌లోని సాయిసూర్య డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3.63 కోట్లు వసూలు చేసి వినియోగదారుడిని మోసగించింది. నగర శివారులోని మన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ పేరుతో మొదలుపెట్టిన ప్రాజెక్టులో ప్లాట్లు రిజిస్టర్ చేయిస్తామంటూ నమ్మించి వంచించింది. మంగళవారం బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జూబ్లీహిల్స్‌కు చెందిన అచ్యుతసింగ్ నైజీరియాలో వ్యాపారం చేస్తున్నాడు. సాయిసూర్య డెవలపర్స్ సంస్థ ప్రాజెక్టుల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని ఆకర్షితుడయ్యాడు. 2021 నవంబరులో సంస్థ ఏజెంట్ కరీమ్‌ను సంప్రదించగా, హైదరాబాద్ శివారు, వికారాబాద్‌లో ప్రాజెక్టులు ప్రారంభిస్తోందని వివరించాడు. అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయానికి వెళ్లి ఎండీ సతీశ్ చంద్ర గుప్తాను కలిశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మాన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు ఎండీ వివరించాడు. తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు చెప్పాడు. అచ్యుతసింగ్ సర్వే నం.32లో 1230, 900 చదరపు గజాల చొప్పున రెండు స్థలాలను రూ.3.63 కోట్లకు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. 2022 జనవరి తొలివారంలో రిజిస్ట్రేషన్‌కు అంగీకారం కుదుర్చుకున్నారు. గడువులోగా రిజిస్టర్ చేయిస్తామని చెప్పడంతో అచ్యుతసింగ్ మొత్తం నగదు చెల్లించాడు. 2022 జనవరి 7న రిజిస్ట్రేషన్ చేయిస్తానని సతీశ్‌చంద్ర చెప్పడంతో. అచ్యుతసింగ్, ఆయన కూతురు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. సతీశ్ రాకపోవడంతో అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్లగా, సతీశ్ చంద్ర నెల్లూరు వెళ్లినట్లు సిబ్బంది చెప్పారు. సతీశ్ చంద్ర కాలయాపన చేయడంతో, బాధితుడు సంస్థ గురించి ఆరా తీయగా మరింత మందిని మోసం చేశారని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. సతీశ్‌చంద్ర, కరీమ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వివరించారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

హామీల అమలులో సర్కారు విఫలం: వంటేరు


చెక్కులు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి, తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం మర్కుక్ మండలం వరదరాజుపూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా జీవిత బీమా పొందిన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు భారాస కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ బాలరాజు, ఎంపీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, భారాస మండల బీసీ సెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య, జిల్లా నాయకుడు సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు


వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

రాయపోల్, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు విధులకు హాజరు కామని ఆశా వర్కర్లు మంగళవారం రాయపోల్ వైద్యాధికారి మహేరాజు బల్లాకు సమ్మె నోటీసు ఇచ్చారు. నెలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని, ఆశా వర్కర్లు మరణిస్తే రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య కార్డులతో పాటు అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో ఆశలకు విధులు కేటాయించొద్దని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోహెడ, కోహెడ గ్రామీణం: కోహెడ మండలంలోని ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించే వరకు శాంతియుతంగా సమ్మెలో పాల్గొంటున్నట్లు మండల వైద్యాధికారిణి నిమ్రాకు సమ్మె పత్రం అందజేశారు. మండలాధ్యక్షురాలు దబ్బెడ రజిత, రాజమణి, మమత, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో పట్టణాభివృద్ధి పనులు


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పురాధ్యక్షురాలు స్వరూపారాణి, తదితరులు

చేర్యాల, న్యూస్‌టుడే: పట్టణ ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకొని ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పురాధ్యక్షురాలు స్వరూపారాణి అన్నారు. బల్దియా పరిధిలోని 4వ వార్డు శ్రీనగర్‌కాలనీలో మంగళవారం సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలోని పలు వార్డుల్లో పనులు చేపట్టినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీశ్, నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దొంగ పట్టివేత

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేటలో రెండు రోజుల క్రితం ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగను పట్టుకున్నట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. గత నెల 30న సాయంత్రం తంగళ్లపల్లి పర్శయ్య ఇంట్లో దొంగతనం జరిగి రూ.1.50లక్షలు అపహరించిన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్‌ఐ దర్యాప్తు చేపట్టగా.. సిద్దిపేట రూరల్ మండలం నాంచారుపల్లికి చెందిన గడ్డం అనిల్‌కుమార్ ఈ దొంగతనం చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు అతన్ని అరెస్ట్ చేసి విచారించగా నేరం అంగీకరించాడు. అతని నుంచి రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా అతని మానసిక పరిస్థితి బాగా లేక గ్రామాల్లో తిరుగుతూ ఉంటాడని చెబుతున్నారు.

'చౌక'గా కొంటూ.. సొమ్ము చేసుకుంటూ

న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం:


కోహెడ శివారులో పట్టుబడిన వాహనంతో ఎస్‌ఐ అభిలాష్, సిబ్బంది

ప్రభుత్వం దారిద్య్రరేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలకు ప్రతి నెల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. కొంతమంది లబ్ధిదారులు మాత్రం ఈ బియ్యాన్ని తినకుండా వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న అక్రమార్కులు కార్డుదారుల నుంచి ప్రతి నెలా కొనుగోలు చేస్తూ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నా వారిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కొనసాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సాగుతున్న రేషన్ బియ్యం దందాపై 'న్యూస్‌టుడే' కథనం..

ఇళ్ల వద్దే తూకం

ప్రభుత్వం ప్రతి నెల ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున కుటుంబ సభ్యులందరికీ బియ్యం పంపిణీ చేస్తుంది. లబ్ధిదారుల వద్ద 50 నుంచి 100 కిలోల బియ్యం జమకాగానే బియ్యం కొనుగోలు దారులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లోకి వస్తున్నారు. ఊళ్లలో ఏదో ఒక చోట వాహనాలు నిలిపి.. ఇళ్ల వద్దనే బియ్యం తూకం వేస్తూ వాహనాల్లో తరలిస్తున్నారు. కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నారు. ఇవే బియ్యాన్ని వ్యాపారులకు అధిక ధరలకు అమ్ముతూ డబ్బులు దండుకుంటున్నారు. ఒక్కో గ్రామం నుంచి క్వింటాళ్ల కొద్ది బియ్యాన్ని ప్రతి నెల అక్రమంగా తరలిస్తున్నారు. కొంతమంది కార్డుదారులు వాడుకుంటున్నా.. చాలా మంది అమ్మేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కార్డులు	లబ్ధిదారులు	ప్రతి నెల ఇస్తున్న బియ్యం (మె.ట.)
రేషన్..	2,72,997	5068.476
అంత్యోదయ..	18,321	641.235
మొత్తం	2,91,318	5709.711

కేసులు నమోదవుతున్నా ఆగని రేషన్ బియ్యం తరలింపు

తనిఖీలు చేస్తున్నా..

ఓ వైపు పౌరసరఫరాల అధికారులు, మరోవైపు పోలీసులు తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నా.. కొనుగోలుదారులు మాత్రం యథేచ్ఛగా బియ్యం తరలిస్తున్నారు. ఇటీవల 164 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో వెళ్తున్న డీసీఎంను కోహెడ పోలీసులు పట్టుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. గ్రామాల్లో సాగుతున్న రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్రిమినల్ కేసులు తప్పవు

– తనూజ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి, సిద్దిపేట

అక్రమంగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి పట్టుబడితే క్రిమినల్ కేసులు తప్పవు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రభుత్వానికి చేరవేస్తున్నాం. కొనుగోలుకు సంబంధించిన సమాచారం అందిస్తే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం.

'నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతా'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి

గజ్వేల్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిరుద్యోగులకు బాసటగా నిలిచేందుకే రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో పోటీ చేయదలిచినట్లు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలనుకుంటున్న ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం విస్తృతంగా పర్యటించి పలు ప్రైవేటు ప్రభుత్వ కళాశాలల బృందంతో మద్దతు కోరుతూ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్సీగా గెలిచిన నాయకులు పట్టభద్రుల సమస్యలను విస్మరించి రాజకీయాలకే సమయం కేటాయించారన్నారు. ప్రతి పట్టభద్రుడు నవంబరు 6 లోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంబురాలు

సిద్దిపేట, న్యూస్‌టుడే: బీఎస్ఎన్ఎల్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేటలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంస్థ ఉద్యోగులు మంగళవారం సంబురాలు నిర్వహించారు. కేక్ కోసి పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. సబ్ డివిజనల్ ఇంజినీర్లు చిట్టిపాక రవీందర్, మోహన్‌రెడ్డి, శ్రీకాంత్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

'బతుకమ్మ' టెండర్లపై ఆరోపణలు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పురపాలక సంఘం నిర్వహించిన బతుకమ్మ వేడుకల నిర్వహణ టెండర్లలో గోల్‌మాల్ జరిగిందని కౌన్సిలర్ గోవిందు రవి ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్లకు తెలియకుండా టెండర్లు నిర్వహించారన్నారు. ఏర్పాట్లకు రూ.15 లక్షల పనులకు టెండర్లు ఇచ్చారన్నారు. ఈ విషయమై పుర కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పురపాలిక తీర్మానం ప్రకారం టెండర్లు నిర్వహించామన్నారు. ప్రకటనలు ఇచ్చామని తెలిపారు.

పరుగు పోటీలు ప్రారంభం.. బహుమతులు ప్రదానం



విజేతలతో పురాధ్యక్షురాలు రజిత, ఎంఈవో మనీలా, పీడీలు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మినీ స్టేడియంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ పోటీలకు మంచి స్పందన లభించింది. మంగళవారం స్థానిక స్టేడియంలో పరుగు పోటీలను పురాధ్యక్షురాలు ఆకుల రజిత ప్రారంభించారు. హుస్నాబాద్‌లోని జడ్పీ బాలుర, బాలికల పాఠశాలలు, పోతారం(ఎస్) జడ్పీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ గురుకుల, గిరిజన ఆశ్రమ, ఆదర్శ, బెజ్జంకి గురుకుల, స్థానిక ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 80 మంది బాలికలు, 90 బాలురు పోటీలలో పాల్గొన్నారు. 100 మీటర్ల పరుగులో జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థి అక్బర్ ప్రథమ, అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థి ప్రవీణ్, బాలికల విభాగంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బెజ్జంకి విద్యార్థులు అర్చన ప్రథమ, బి.భాగ్య ద్వితీయ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మనీలా, పురాధ్యక్షురాలు అనిత, ఎస్‌జీఎఫ్ నిర్వహణ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారుడు లింగమూర్తి, పీడీ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ నళిని తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై 'కనువిప్పు'


మాట్లాడుతున్న ఎస్సై గంగరాజు

దుబ్బాక, న్యూస్‌టుడే: ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడాలని దుబ్బాక ఎస్సై వి.గంగరాజు అన్నారు. మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో మంగళవారం సిద్దిపేట జిల్లా పోలీస్ కళా బృందం, సాంస్కృతిక సారథి కళాకారులతో మూఢ నమ్మకాలు, రహదారి భద్రత, సైబర్ నేరాలపై 'కనువిప్పు' పేరిట నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి వాహనదారుడు రహదారి భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఆటపాటలతో చేసిన ప్రదర్శనలు గ్రామస్థులను ఆలోచింపజేశాయి.

జగదేవపూర్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ చంద్రమోహన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బానోత్ రాజన్నలు అన్నారు. కళాశాలలో సైబర్ నేరాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

జగదేవపూర్: అసంఘటిత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర బీమా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల నాయకులు, ఆయా గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు: భారాస

సిద్దిపేట టౌన్: పదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే హరీశ్‌రావుపై మైనంపల్లి హనుమంతరావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని భారాస సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, రమేశ్‌గౌడ్ విమర్శించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. మల్కాజిగిరి ప్రజలు తిరస్కరించిన నాయకుడు మైనంపల్లి అన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను పరామర్శించే బదులు వారికి వచ్చే పరిహారాన్ని ఇప్పించాలని హితవు పలికారు. భారాస నాయకులు పాపయ్య, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక గ్రామీణం: కొండపాక ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన పనిచేసేందుకు ఆంగ్ల ఉపాధ్యాయుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ యజ్ఞశ్రీ తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నెల 16న కళాశాలలో నిర్వహించే ముఖాముఖికి అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

మొగిపురుగుతో 'మోడు'



చేర్యాల మండలం ఆకునూరులో మల్లయ్య పొలం వద్ద తాటిచెట్లు ఇలా మోడువారి పోయాయి. రెండేళ్ల క్రితం వరకు 25 చెట్లు ఉన్నాయని, అనుకోకుండా ఇలా మొగిపురుగుతో పనికిరాకుండా పోయాయని రైతు తెలిపారు. రెండు దశాబ్దాల కిందట పక్క రైతుతో గట్టు పంచాయితీ ఏర్పడడంతో ఇరువురి పొలాల మధ్య ఇలా తాటిచెట్లు పెట్టారు. ఇవి ఏపుగా పెరగడంతో గీత కార్మికులు కల్లుతీసి ఉపాధి పొందారు. గత రెండేళ్లలో ఇలా ఎండిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

– న్యూస్‌టుడే, చేర్యాల

ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు తగదు: ఎమ్మెల్యే

దుబ్బాక, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల్లో ప్రజా ప్రతినిధులపై అబద్ధాలు ప్రచారం చేయడం సరికాదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇటీవల దుబ్బాకలో మంత్రి కొండా సురేఖ పర్యటనపై కొందరు సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భారాస సోషల్ మీడియా ఎప్పుడూ ఇలాంటి ఘటనలకు పాల్పడదన్నారు.

విధులకు ఆటంకం.. ముగ్గురిపై కేసు

జగదేవపూర్, న్యూస్‌టుడే: జగదేవపూర్‌లోని రెడ్డమైన చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిపోసి ఆక్రమణలు చేస్తున్న వారిని అడ్డుకున్నందుకుగాను నీటి పారుదల శాఖ సహాయకుడిపై కొంతమంది దాడి చేశారని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మూడు రోజుల కిందట జరిగిన ఈ ఘటనలో నీటిపారుదల శాఖ సహాయ ఉద్యోగి శ్రీపతి మల్లేశంను గాయపరిచి విధులకు ఆటంకం కలిగించారన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు విచారణ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుకాణంలో చోరీ

చేర్యాల, న్యూస్‌టుడే: చేర్యాల జాతీయ రహదారిపై ఉన్న విఘ్నేశ్వర నావల్టీస్ దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగిందని ఎస్సై నీరేశ్ తెలిపారు. దుకాణం షెట్టర్‌ను గునపంతో పైకి లేపి లోనికి దూరిన దుండగులు రూ.62వేల నగదును అపహరించినట్లు చెప్పారు. డబ్బులతో పాటు ఎత్తుకెళ్లిన పర్సుని మండలంలోని ముస్త్యాల నుంచి మద్దూరు మండలం నర్సాయపల్లికి వెళ్లే దారిలో పడేసి వెళ్లారు. బాధితుడు చీకోటి విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విగ్రహానికి నిప్పంటించిన యువకుడి అరెస్టు

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం చౌటపల్లిలో ఆవిష్కరించని తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పంటించిన ఘటనలో అదే గ్రామానికి చెందిన యువకుడు కామాద్రి రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా రాంబాబు చేశాడని గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


వాట్సప్ వేధింపులపై.. అక్కన్నపేట మండలం చాపగానితండాకు చెందిన ఆటోడ్రైవర్ రాంచందర్‌ను వేధిస్తున్న యువకుడు గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. కొన్ని రోజులుగా వారి మధ్య వివాదం నడుస్తోంది. దాన్ని మనసులో ఉంచుకున్న గణేశ్ వాట్సప్‌లో రాంచందర్ ఫొటోను పోస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై రాంచందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బడుల్లో బతుకమ్మ సంబురం


దుబ్బాక: కస్తూర్బా పాఠశాలలో..


మిరుదొడ్డి: పెద్ద చెప్యాల పాఠశాలలో..


రాయపోల్: మండలం మంతూరులో..


చిన్నకోడూరు: ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాలలో..


జగదేవపూర్: ఆదర్శ పాఠశాలలో..


హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేటలో..

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా మంగళవారం జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను పేర్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మల చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ పాటలు పాడి సందడి చేశారు. పలుచోట్ల కోలాట నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకోగా.. బతుకమ్మ పేర్చడంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు స్థానిక నీటి వనరుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– న్యూస్‌టుడే బృందం

రాష్ట్ర స్థాయి పోటీల్లో సిద్దిపేట క్రీడాకారుడి ప్రతిభ


క్రికెట్ క్రీడాకారుడు జశ్వంత్

సిద్దిపేట టౌన్: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారుడు జశ్వంత్ సత్తా చాటాడు. అండర్-14 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో లీగ్ దశలో జశ్వంత్ ఆంధ్రప్రదేశ్ జట్టుపై 25 పరుగులు, మూడు వికెట్లు పడగొట్టాడు. మధ్యప్రదేశ్ జట్టుపై ఐదు వికెట్లు తీసి తెలంగాణ జట్టును సెమీఫైనల్‌కు చేర్చాడు. ఆ తర్వాత చెన్నై జట్టుపై ఏడు వికెట్లు తీసి ఫైనల్‌కు చేర్చడంలో కీలక భూమిక పోషించాడు. ఫైనల్ మ్యాచ్‌లో ముంబయి జట్టుపై మూడు వికెట్లు పడగొట్టి 25 బంతుల్లో 65 పరుగులు చేసి తెలంగాణ జట్టును విజయతీరాలకు చేర్చి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాడు. రెండు మ్యాచ్‌ల్లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' సొంతం చేసుకున్నాడు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

అగ్నిమాపక కేంద్ర భవనం నిర్మించరూ!

దుబ్బాక: ఎన్ని ప్రభుత్వాలు మారినా దుబ్బాక అభివృద్ధికి నోచుకోవడం లేదని దుబ్బాక డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ అన్నారు. మంగళవారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణానికి దాతలు ఎకరం స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చినా, నేటికి నిర్మించకపోవడం బాధాకరమన్నారు. కరీంనగర్ డీఎఫ్‌వోకు వినతిపత్రం సమర్పించామన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలంటూ ర్యాలీ



కథాకళి వేషధారణలో కళాకారులు

సిద్దిపేట టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మంగళవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ పట్టణంలోని పురవీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కథాకళి వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నారు. బసిల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో శ్రమదానం నిర్వహించారు. ప్రిన్సిపల్ జీవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సువర్ణాదేవి, అధ్యాపకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(మద్దూరు): కాలుష్యానికి కారకమైన పాలిథీన్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ పిలుపునిచ్చారు. మండలంలోని వల్లంపట్లలో ప్లాస్టిక్ నిషేధంపై మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు చేర్యాల విద్యార్థులు

చేర్యాల, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపికలు సోమవారం హుస్నాబాద్‌లో జరిగాయి. 17 ఏళ్ల లోపు విభాగంలో చేర్యాల ప్రాంతానికి చెందిన విద్యార్థులు మంగళవారం ప్రతిభను కనబరిచి ఉమ్మడి జిల్లా తరుపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని చేర్యాల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో ఆర్.కిష్టయ్య, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

పేదల సంక్షేమానికి కృషి: బండారు

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంతరావు అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం జాలిగామలో ఇటీవల కురిసిన వర్షాలకు రాజలింగం ఇల్లు కూలిపోవడంతో.. ఇంటిని పరిశీలించి బాధితునికి అండగా ఉంటామని ప్రకటించారు. టీపీసీసీ ప్రచార కార్యదర్శి నాయిని యాదగిరి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు ఉన్నారు

డీఎస్సీలో మెరిసిన రాజశేఖర్


తల్లిదండ్రులతో రాజశేఖర్

హుస్నాబాద్ గ్రామీణం: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌కు చెందిన కొయ్యడ రాజశేఖర్ డీఎస్సీ-2024 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్‌లో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. తండ్రి కొమురయ్య గీత కార్మికుడు, కాగా తల్లి కోమల కూలీ. రాతపరీక్షలో 67.50 మార్కులు, టెట్‌లో 14.93 మార్కులు కలిపి మొత్తం 82.43 మార్కులు పొందారు. మొదటి ర్యాంకు సాధించడంతో గ్రామస్థులు రాజశేఖర్‌ను మంగళవారం అభినందించారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

బెజ్జంకి, న్యూస్‌టుడే: మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక తరలిస్తున్న మినీ టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్, పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై క్రిష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.